# పెళ్ళిలొల్లి

'శ్రీ సీతారాముల కళ్యాణము చూతము రారండీ.....' పచ్చని పెళ్లి పందిట్లో ముచ్చటైన పాటల హోరు. లోపల పెళ్లికూతురు గదిలో కబుర్ల హోరు.

"అక్కాచెల్లెళ్ల పెళ్లిల్లు ఒకేరోజు ఒకే గంట తేడాతో... ఆహా! అలాంటి ముహూర్తాలు కుదరడం అదృష్టమే" పది గంటలకు మూడు ముళ్లు వేయించుకోబోతున్న స్రవంతికి పూలజడ వేస్తున్న స్నేహితురాలి మురిపెం.

'అవునవును. ఈ ముద్దుల పెద్దమ్మాయి క్కాబోయే మొగడు మురళీకృష్ణ మిల్ట్రీలో పెద్దాఫీసరాయె. మిసైల్స్ ప్రయోగించే చేతుల్తో దీని మెడలో మంగళసూత్రం కట్టేసి కోటి కోర్కెల కొంగుముడి విప్పేస్తాడే... నగలతోపాటు సిగ్గులు సింగారించుకున్న స్రవంతి బుగ్గల మీద మీరోహితురాలి నున్నని వేళ్లు సున్నితంగా చిందులేసినై.

"ఛీ...పోవే! స్రవంతి నవ్వేసింది. ఆ నవ్వు ఒడ్డుతో పరాచకాలాడే చెరువు అలల సంగీతం లాగుంది. అప్పుడా పెళ్ళికూతురు వయసు పరువాలను పట్టుపుట్టాల్లో అదిమి పెట్టింది. కృష్ణశాస్త్రి ఊర్వశిలా, రాజా రవివర్మ రంగుల చిత్రంలా కన్పించింది.

'ఓఫ్ అక్కా! బంగారు బొమ్మ లాగున్నావే!' పదకొండ గంటలకు కార్పొరేట్ కంపెనీలో కలం బలం చూపిస్తున్న గంగాధర్ కరగ్రహణం చేయబోతున్న సాగరిక - అక్కను ఆపాదమస్తకం పరిశీలించి ఠక్కున కౌగిట్లో బంధించింది. స్రవంతి ఉక్కిరి బిక్కిరైంది.

"అబ్బా! ఇప్పుడే అక్కాచెల్లెళ్లు అలా కౌగిట్లో కరిగిపోతుంటే మీ మొగుళ్లకేం మిగులుతుందటా!" ఓ పెద్ద ముత్తైదువ బుగ్గలు నొక్కుకుంటూ, ఓరకంటితో చూస్తూ తన శోభనం నాటి దృశాన్ని నెమరేసుకుంటూంది. నవ్వుల పువ్వులు గది నిండా పరుచుకున్నై. కాఫీ టిఫిన్లతో వాతావరణం సందడిగా ఉంది. లంకంత ఇల్లు కళ్యాణ శోభతో కళకళలాడ్తూంది.

ఇద్దరు పెళ్ళికూతుళ్ల తండ్రి వెంకట్రామయ్య... చేతి గడియారం చూసుకుంటూ వసారాలో పచార్లు చేస్తున్నాడు. అతని గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నై. టైం తొమ్మిది కాబోతుంది.

అంతా బాగానే ఉంది గాని అల్లునినోట్లో శని కూచుందన్నట్టు - పది గంటలకు పెద్దమ్మాయి మెడలో తాళి కట్టాల్సిన మురళీకృష్ణ ఇంకారాలేదు. పదకొండు గంటలకు చిన్నమ్మాయి క్కాబోయే భర్త నిన్ననే వచ్చేసిండు. పెళ్లిళ్ల వారంతా బంధు బలగాలతో తరలి వచ్చేసిండ్రు. పెద్దమ్మాయి పెళ్లెట్లా జరుగు తుందో... చేతులు పిసుక్కుంటున్నాడు. నుదుటి. మీది ముచ్చెమట బిందు రూపందాల్చి ముత్యాల్లా కనపడుతూంది. కండువాతో చెమట అద్దుకున్నాడు.

అంతా గమనిస్తున్నాడు అతని తండ్రి సీతారామయ్య

"మిల్ట్రీవాణ్ని అల్లుడుగా చేసుకోవద్దంటే విన్నావా! ఎప్పుడు యుద్ధమొస్తుందో.... ఏమై పోతుందోనని భయపడితే నీతులు చెప్తివి గదరా! జాతస్యహి ధృవో మృత్యుః... సైన్యంలో లేనివారు కూడా ఛస్తున్నారు. గదా, దేశం గురించి కూడా ఆలోచించాలని వాదిస్తివి గదరా! ఇప్పుడేమో దేశ సరిహద్దులో యుద్ధ వాతావరణమాయె. ఆ అబ్బాయెక్కడున్నాడో.... అతనికేమయిందో..." చెట్టంత కొడుకును తిట్టలేక, చేసే దేమీ లేక విసుక్కుంటూన్నాడు.. మనవరాలి మీదున్న మమకారం కొడుకు మీద కోపం తెప్పిస్తూంది.

అగ్నిలో ఆజ్యం పోసినట్టైంది వెంకట్రామయ్యకు. ఓ క్షణం మెదడు స్తంభించి పోయింది. కూడా. ప్రతివాడూ నా ఇల్లూ, నా పిల్లలనేవాడే గాని, ఇది నా దేశం దీన్ని కంటికి రెప్పలా రక్షించుకోకపోతే భవిష్యత్తులో ఇల్లూ, పిల్లలు తమ ఉనికే కోల్పోతారన్న ఇంగితజ్ఞానం గూడా లేకపోతే ఎట్లా.... కాని... కన్నతండ్రి, వృద్ధాప్యం, అటు ఆరాటం, ఇటు ఆవేశం అన్నీ మింగేసి నిర్లిప్తంగా నవ్వేసిండు.

'అది కాదు నాన్నా! ఏర్పాట్లన్నీ కానీ, పెళ్లికి ముందే నేరుగా పెళ్ళి పందిట్లో కొస్తానని నిశ్చితార్థంనాడు కచ్చితంగా చెప్పి వెళ్లిన మురళీకృష్ణ.... ఇంకా రాకపాయె.

'ఎంతైనా మిల్ట్రీ నౌకరి గదా... ఎప్పుడే మవుతుందో ఎవరూహిం చగలరూ?"

'అబ్బా... ఏమీ కాదు నాన్నా... ఆ మాటలు ఇంటి ముందుకొచ్చి ఆగిన కారు సౌండ్‌లో కలిసిపోయినై. మురళీకృష్ణ హుందాగాదిగి వస్తున్నాడు.

'సారీ మామయ్యా! నిన్ననే హైదరాబాద్‌లో దిగాను. ఇక్కడికి గంట ప్రయాణమే కదాని మా ఫ్రెండ్ ఇంటికెళ్ళాను. వాడేమో ఉదయమే వెళ్దామన్నాడు. తెల్లవారక ముందే కారులో బయలుదేరినం. కాని.... అది మధ్యలో ఫెయిలైంది. ఒకరు హైద్రాబాదెళ్లి మెకానిక్‌ను తీసుకొచ్చి రిపేర్ చేయించుకుని వచ్చేసరికి.. అదీ ఆలస్యానిక్కారణం..." బలవంతంగా నవ్వుతూ దోషిలా నిలబడ్డాడు మురళీకృష్ణ, ఆనవ్వు వెంకట్రామయ్య పాలిట వెన్నెల వెలుగైంది.

నెత్తిమీదున్న పది క్వింటాళ్ల బరువును పదిలంగా దించుకున్నట్టనిపించింది.

'ఫరవాలేదు. బాబూ! వెళ్లు.. తర్వగా తయారుకావాలి..." వెంకట్రామయ్య మొహం వెలిగిపోయింది.

కారు ఫ్రెండు పరమేశ్వర్‌ను పరిచయం చేసి లోపలికెళ్లిండు మురళీకృష్ణ కాబోయే తోటలల్లుడితో కరచాలనం చేసి పరమేశ్వర్‌ను పరిచయం చేయ్యబోయిండు.

'ఒరే... గంగా... నువ్వా!' పరమేశ్వర్ మొహం మతాబులా వెలిగింది.

'ఆహా! పరమేశ్వరా! ఐతే కారు కొన్నావన్న మాటా. మనిద్దరం ఒకే ఊరివారమని మా అన్నగారికి తెలీదు గదా!" గంగాధర్ గుండెలుప్పొంగినై.

'కాఫీ టిఫిన్లు ఐపోయినై. పట్టు ధోవతి, పట్టు లాల్చీ మురళీకృష్ణ ఒంటి మీది కొచ్చినై. పెళ్లికొడుగ్గా తయారవుతూంటే మనసు పక్కగదిలో పెళ్లికూతురవు తున్న స్రవంతి వైపు లాగుతోంది.

'ఒరేయ్ పరమేశ్వరా! పరమేశ్వర్ చెయ్యందుకున్నాడు. గంగాధర్. 'నా పెళ్ళికింకా టైముంది గాని నీ కారులో మనమలా షికారు కెళ్లొద్దాం పదా!'

'అవున్రా! ఈ ఊళ్లో గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్లు దొరకవటా..."

"ఇంకేం... పక్కూరికెళ్లి తెచ్చుకుందాం."

'మీ వాళ్లు గొడవ చేస్తారేమోరా.. పెళ్ళికొడుకువుగదా! పరారై పోయినా పనుకుంటారేమోరా!'

'జోక్స్ చాలు గానీ ఎవ్వరేమీ అనుకోరు. అరగంటలో వచ్చేస్తాం గదా!'

'బంగారు బొమ్మ రావేమే.... పందిట్లో పెళ్లి జరిగేనే... నాదస్వరం పాటకు తాళం వేస్తున్న స్నేహితురాళ్ల గాజుల గలగలలు, కిలకిలలు, కాలి అందియల సవ్వడిని వింటూ మత్తగజములా అడుగులేస్తూ స్రవంతి పెళ్లి పందిట్లోకొచ్చింది.

నుదుట బాసిగాలు, బుగ్గన పెళ్ళిబొట్లతో మురళీకృష్ణ - స్రవంతి ఓరచూపులు దోబూచులాడుకున్నై.

వేదమంత్రాలు గొంతులు సవరించినై. అటు పెళ్ళికూతురు చెక్కిళ్ల మీద తచ్చాడుతున్న సిగ్గు మొగ్గల్ని మురళీకృష్ణ ఓరచూపులు ఏరుకుంటుంటే గణేశ పూజ, లక్ష్మీపూజ, జిలకర బెల్లం, సూత్రధారణ, తలంబ్రాలు... శాస్త్రోక్తంగా జరిగిపోయినై.

వెంకట్రామయ్య దంపతుల మొహాలు వెలిగిపోయినై.

హమ్మయ్య! పెద్దమ్మాయి పెళ్ళైపోయింది. ఇహ చిన్నమ్మాయి పెళ్ళి.." పీల్చుకున్న ఊపిరి కొత్త శక్తినిచ్చింది.

సమయం పదిన్నరైంది చూపిస్తోంది.

గదిలో పెళ్ళికూతురై కూచున్న సాగరిక స్నేహితురాళ్ల కబుర్లు! జోక్స్, వసంతాగమనములో కలకూజితాల కలరవాలను మరిపిస్తున్నై.

'అరగంటలో గంగాధర్, అర్థాంగివి కాబోతున్నావు గదా...మరా గంగాధర్ తలలో ఏ గంగమ్మనన్నా కూచుందేమో కనుక్కున్నావా?"

'గంగాధర్ నెత్తి మీద సాగరిక అంటే ఆ గంగమ్మనే కూచోబోతుంది గదా!'

'అయితే... మరో పార్వతి దరిజేరకుండా జాగ్రత్త గుండాలేమో!...

నవ్వుల పువ్వులు గదంతా అలుముకున్నై.

ఇటు పెళ్లిపందిట్లో.

'అయ్యా, నేనెన్నిసార్లు గొంతు చించుకున్నా పెళ్ళికొడుకు గంగాధర్‌గారు రావట్లేదు. పెద్దవాళ్లెవరన్నా తీసుకురండి. శ్రీ గణేశపూజ, లక్ష్మీపూజ పావుగంటలో ముగించాలి. పెళ్ళి ముహూర్తానికి పదే నిమిషాల టైముంది." పిలక సవరించుకుంటూ పురోహితుడు వార్నింగులు వడ్డిస్తున్నాడు.

ఏడీ... పెళ్లికొడుకెక్కడా కనబడ్డం లేదు. పెళ్లివారిల్లు, మగపెళ్ళి వారి విడిది, గంగాధర్‌కు కేటాయించిన గదంతా వడబోసి వచ్చినవారు నోర్లు తెరిచింద్రు.

గంగాధర్ తల్లిదండ్రుల మనస్సుల్లో గందరగోళం.

'ఏడీ వేధవా! పొద్దట్నుంచి పేకాడుకుంటూ గదిలోనే ఉండే గదా!' మెదడు పొరల్లోని ఒత్తిడిని తట్టుకోలేక తండ్రి నుదురు కొట్టుకున్నాడు.

'అవును, మరెక్కడున్నాడిప్పుడు? మరోసారి వెత కండంతా" తల్లికి బి.పి. పెరిగింది.

బంధుమిత్రులు కట్టగట్టుకొని ఒకటికి రెండుసార్లు గట్టిగా వెతికి ఉట్టిచేతులూపు కుంటూ వచ్చేసింద్రు.

'కాశ్మీర్ సరిహద్దుల్లో మంచుకొండల్లో ఉన్న మురళీ కృష్ణ టయానికొచ్చిండు... కానీ వీనికేమొచ్చిందటా?" గంగాధర్ అన్నయ్య - పీకల దాకా పేకాటలో మునిగిన తమ్ముని మిత్రుల్ని నీలదీసిండు.

'అరె.... పారిపోయిండేమో! వానికీ పెళ్లి ఇష్టం లేదేమో!"

'ఇంకో అమ్మాయి నెవరినన్నా ప్రేమించిండేమో!'

'వాడెక్కడ మందుగొట్టి పడుకున్నాడో ఏమో!' వెంకట్రామయ్య ప్రత్య క్షమయాడక్కడ.

పేకాట మొహాలు పిడచగట్టురే పోయినై.

'త్వరగా వస్తానని పరమేశ్వర్ కారులో పక్కూరి కెళ్లిండు..." చెప్పలేక చెప్పిండో మిత్రుడు పేక ముక్కల్ని కింద ఉంచేసి.

ఓ యువ హీరో నెక్కించుకుని హీరోహోండా ఆఘమేఘాల మీద పక్కూరికి పరుగులు తీసింది. పావుగంటలో తిరిగొచ్చింది.

హీరో వాలకం జీరోలాగుంది.

"గంగాధరేడీ? వస్తున్నాడా?" ఎదురెల్లి ఆత్రంగా అడిగిండు వెంకట్రామయ్య.

"సారీ అంకుల్!" హీరో హీరోహోండా దిగిండు. 'పరమేశ్వర్, గంగాధర్ గార్ల కారు బ్రేకులు పెయిలై రోడ్డు దిగిందటా. నేరుగా పరుగెత్తి గుట్టను గుద్దేసిందటా. రక్తం మడుగులో ఇద్దరూ శవాలై కన్పించింద్రు. అదంతా ప్రత్యక్షంగా చూసినోళ్ళు, రోడ్డు మీదెల్తున్న జనాలు చుట్టూ మూగి చూస్తున్నారు. అదో భయంకర దృశ్యం. నాకు కళ్లు తిరిగినాయనుకోండి."

'హరిహరీ!' సైన్యంలో ఉన్నవాడు సేఫ్‌గా వచ్చిండు పక్కూరికెళ్ళినోడు ప్రాణాలొది లిండు...". సీతారా మయ్య చెవులు మూసుకున్నాడు.

**30 మార్చి 2003 ఆదివారం ఆంధ్రభూమి**

